సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



**పెరిగిన పాడి ఆవులు**
జిల్లాలో పాడి ఆవుల సంఖ్య పెరుగుతోంది. సమృద్ధిగా మేత, నీళ్లు లభ్యమవుతున్నాయి. దేశవాళీ ఆవుల పాలు, నెయ్యి, పేడ కానులు కురిపిస్తున్నాయి. 8లో



**టమాట కిలో రూ.33**
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
28.3°/20.7°

జిల్లా వ్యాప్తంగా ఆదివారం తుపాను వాతావరణం నెలకొంది. చలి తీవ్రత కొంత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. వాయువ్య దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**ప్రశాంతి నిలయం:** కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలిపారు.

**పోలీస్ కార్యాలయంలో...**
**పుట్టపర్తి టౌన్:** జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకురావాలన్నారు.

### 14 నుంచి 'ఎనర్జీ'పై షార్ట్ వీడియో పోటీలు

**పుట్టపర్తి:** జిల్లాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఎనర్జీ ఎఫిషియన్సీ, ఎనర్జీ కన్జర్వేషన్‌కు సంబంధించిన అంశాలపై షార్ట్ వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు సెంటర్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపీ4 ఫార్మాట్‌లో వీడియో నిడివి రెండు నిమిషాలు ఉండాలని పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచన వారికి రూ.5వేలతో పాటు కన్సొలేషన్ కింద పది మందికి రూ.2వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నామినేషన్లు సమర్పించేందుకు ఈ నెల ఐదో తేదీ చివరి రోజని పేర్కొన్నారు.

### ఇసుక డంపు స్వాధీనం



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎస్‌ఐ సోమశేఖర్

**బత్తలపల్లి:** రామాపురం వద్ద చిత్రావతి నది సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ ఆదివారం సాయంత్రం బత్తలపల్లి బైపాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. అందిన సమాచారం మేరకు ఏక కాలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను, రామాపురం చిత్రావతి నది సమీపంలో నిల్వ ఉంచిన ఇసుక డంపును గుర్తించారు. ఇసుకను సీజ్ చేసి, టిప్పర్, జేసీబీ వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుల్ రామాంజనేయులు, బాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

- ప్రబోధానంద ఆశ్రమ జేసీబీ డ్రైవర్‌పై దాడి

**తాడిపత్రి రూరల్:** తాడిపత్రి పరిసరాల్లో గంజాయి బ్యాచ్ ఆగడాలు కొనసాగుతున్నాయి. తాజాగా పట్టణ సమీపంలోని పప్పూరు రోడ్డులో ఆదివారం సాయంత్రం గంజాయి సేవించిన ఆకతాయిలు రెచ్చిపోయారు. ప్రబోధానంద ఆశ్రమానికి చెందిన జేసీబీని అడ్డగించి డ్రైవర్‌ను చితకబాదారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం బెడుదూరు గ్రామ సమీపంలోని ప్రబోదానంద ఆశ్రమానికి చెందిన తోటలో పని ముగించుకొని తాడిపత్రి మండలం చిన్న పొలమడ సమీపంలోని ఆశ్రమానికి జేసీబీ డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి బయలుదేరాడు. స్థానిక పప్పూరు రోడ్డులో గంజాయి బ్యాచ్ రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచగా వాటిని పక్కకు తొలగించాలని కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన వారు ప్రవీణ్ కుమార్‌రెడ్డిని చితకబాదారు. రాళ్లతో జేసీబీ అద్దాలు పగులకొట్టారు. విషయాన్ని ఫోన్ ద్వారా ప్రవీణ్ ఆశ్రమంలోని వారికి తెలియజేయగా.. హుటాహుటిన వారు అక్కడికి చేరుకున్నారు. వారి రాకను గమనించిన గంజాయి బ్యాచ్ అక్కడి నుంచి ఉడాయించింది. అనంతరం బాధితుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డిని కలిసి ఘటనపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

# అతివేగం.. తీస్తోంది ప్రాణం!

- నవంబరు 27న పుట్టపర్తి మండలం నిడిమామిడి వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కియా కార్ల పరిశ్రమలో పని చేసే ఓ ఉద్యోగి దుర్మరణం చెందాడు. పొగమంచుతో పాటు అతివేగం కూడా ప్రమాదానికి కారణమని తేలింది.
- నవంబరు 19న ధర్మవరంలో ఓ ద్విచక్ర వాహనం, ఐషర్ వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మరణించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.
- పెనుకొండ పట్టణ శివారు కియా కార్ల పరిశ్రమ సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద అతివేగం కారణంగా నెలకు 20కి పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మరణించారు. అయినా వేగం మాత్రం తగ్గడం లేదు.
- అతి వేగం కారణంగా జిల్లాలో రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎటు నుంచి ఎవరు వచ్చి ప్రమాదానికి కారణం అవుతారో చెప్పలేని పరిస్థితి. ప్రమాదాలకు మద్యం మత్తు మరో కారణంగా చెబుతున్నారు.



- నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం
- నిబంధనలు అతిక్రమిస్తే ప్రాణాలకు ముప్పు
- జిల్లాలో వాహనదారుల్లో సగం మందికే లైసెన్సులు
- రిజిస్ట్రేషన్లు లేకున్నా రోడ్లపై తిరుగుతున్న వాహనాలు
- మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై కేసుల నమోదు



హిందూపురం మండలం తూమకుంట వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడిన దృశ్యం (ఫైల్)

**సాక్షి, పుట్టపర్తి:** ట్రాఫిక్ నిబంధనలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫలితంగా వారితో పాటు రోడ్డుపై వెళ్తున్న ఇంకొందరి కుటుంబాలకు ఆదరణ లేకుండా చేస్తున్నారు. పలు కుటుంబాలకు కన్నీరు మిగిలిస్తున్నారు. రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే కానీ ప్రమాదాలను నివారించలేని పరిస్థితి. చాలామంది యువకులు ఎడాపెడా రయ్ రయ్‌మంటూ వాహనాలతో రోడ్డెక్కుతున్నారు. ఎదుటి వారిని ఢీకొట్టి ప్రమాదాలకు కారకులు అవుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక చాలామంది చిన్న వయసులోనే పెడదోవ పడుతున్నారు.

**పెరిగిన వాహనాల వినియోగం**
జిల్లాలో ప్రతి నెలా సగటున 1,500 కొత్త వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. కానీ వాహనాల సంఖ్యకు అనుగుణంగా డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవడం లేదు. జిల్లా రవాణా శాఖ కార్యాలయం నివేదికల ప్రకారం నెలకు సగటున వెయ్యి లైసెన్సులు కూడా దాటడం లేదు. వాహనాల వినియోగదారుల్లో సగం మంది పైగా లైసెన్సులు కూడా రోడ్డెక్కుతున్నట్లు స్పష్టమవుతోంది. యువత అతివేగంతో వచ్చి పలు ప్రమాదాలకు కారకులవుతున్నారు. మరోవైపు మైనర్లు వాహనాలు తీసుకొచ్చి రోడ్లపై విన్యాసాలు చేస్తున్నారు. మందలించే వారు లేే మద్యం మత్తులో రోడ్డెక్కుతున్న వారూ ఉన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అధికారులకు చిక్కకుండా తప్పించుకుని వెళ్తున్నారు కానీ.. లైసెన్సులు పొందడం లేదు.

**కాలేజీలు, షాపింగ్‌ల పేరుతో...**
కాలేజీలు, షాపింగ్‌ల పేరుతో చాలామంది మైనర్లు వాహనాలు తీసుకొని ఇంటి నుంచి బయటికి వస్తున్నారు. తల్లిదండ్రులు కూడా సహకరిస్తుండటంతో మైనర్లకు భయం లేకుండాపోతోంది. కాలేజీ, షాపింగ్ పేరుతో రోడ్డెక్కి విచ్చలవిడిగా తిరుగుతున్నారు. లైసెన్సు లేకుండా వాహనం నడిపితే ప్రమాదం జరిగితే కనీసం బీమా కూడా వర్తించదు. ఈ విషయం తెలిసినా వాహనదారులు లైసెన్సు గురించి పట్టించుకోవడం లేదు. ప్రమాదాలకు గురవుతున్న వారిలో సగం మంది పైగా లైసెన్సులు లేని వారే ఉన్నారని పోలీసులు, రవాణా శాఖాధికారులు చెబుతున్నారు.

**ద్విచక్రవాహనాలదే అగ్రస్థానం**
జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,11,233 వాహనాలు ఉన్నాయి. అత్యధికంగా మోటారు బైక్‌లు 2,25,238 ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వారు పొరుగు రాష్ట్రం నుంచి వాహనాలు కొనుగోలు చేస్తుండటంతో ప్రతి ఇంట్లో ఒక ద్విచక్ర వాహనం చొప్పున ఉన్నట్లు చెప్పవచ్చు. ఆటో రిక్షాలు 16 వేలు, కార్లు 15 వేలు, గూడ్స్ వాహనాలు 14 వేలు, ట్రాక్టర్లు 11 వేలు, ట్రాలీలు, జీపులు, క్యాబ్‌లు, విద్యాసంస్థల వాహనాలు, డంపర్లు, అంబులెన్సులు, ఓమ్ని బస్సులు, చెట్ల కోత వాహనాలు కలిపి మొత్తం 3.11 లక్షల వరకు ఉన్నాయి.

**జిల్లా గణాంకాలు**
ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు..

| | |
|---|---|
| 531 | జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు |
| 81 | ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య |
| 783 | గాయపడిన వారి సంఖ్య |

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**



ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చు. మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటికి పంపితే తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుంది.
– వి.రత్న, ఎస్పీ

**లైసెన్సు లేనిదే రోడ్డెక్కరాదు**



వాహనదారులు లైసెన్సులు లేకుండా వాహనాలతో రోడ్డెక్కరాదు. లైసెన్సులు లేని వారు పట్టుబడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. వాహనదారులకు ఎప్పటికప్పుడు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి.
– ఎస్ఎన్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి

### తనయుడిని కాపాడబోయి తండ్రి మృత్యువాత



మృతుడు రామకృష్ణ

**యాడికి:** తనయుడిని కాపాడే క్రమంలో తండ్రి మృత్యువాత పడిన సంఘటన మండలంలోని చింతలాయపల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. చింతలాయపల్లికి చెందిన రామకృష్ణ (44)కు భార్య రాజకుళ్లాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, జగదీష్ అనే కుమారుడు ఉన్నాడు. రామకృష్ణ దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన రామాంజనేయులుతో కలిసి ట్రాక్టర్‌లో చిన్న రాళ్లను లోడ్ చేసేందుకు కుందన కోట గ్రామ సమీపంలో గల కొండ వద్దకు కుమారుడిని వెంటబెట్టుకొని రామకృష్ణ వెళ్లాడు. రామకృష్ణ, రామాంజనేయులు ట్రాక్టర్‌లో రాళ్లను లోడింగ్ చేస్తుండగా జగదీష్ డ్రైవర్ సీటుపైకి ఎక్కి స్టీరింగ్ తిప్పడంతో ఒక్కసారిగా ముందుకు కదిలింది. ఈ క్రమంలోనే రామకృష్ణ పరిగెత్తుకుంటూ వెళ్లి డ్రైవర్ సీటులో ఉన్న తన కుమారుడిని ఎత్తుకొని పల్టీలు కొడుతూ కింద పడిపోయాడు. చిన్న గాయంతో బయట పడిన జగదీష్ లే నాన్నా అని పిలిచినా ఎంతసేపటికీ రామకృష్ణ లేవలేదు. దీంతో అక్కడే ఉన్న కొందరి సాయంతో రామాంజనేయులు ఓ వాహనంలో యాడికి తరలించగా.. అప్పటికే రామకృష్ణ ప్రాణాలు వదిలాడని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### నేత్రపర్వం.. కార్తీక దీపోత్సవం



శివలింగం ఆకృతిలో వెలిగించిన కార్తీక దీపాలు

**ఉరవకొండ:** కార్తీక మాస చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ శైవక్షేత్రం ఉరవకొండ గవిమఠం శోభాయమానంగా మారింది. చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించిన లక్ష దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే హెచ్‌ఐవీ నియంత్రణ



ర్యాలీగా వస్తున్న కలెక్టర్ చేతన్, వైద్య సిబ్బంది

**పుట్టపర్తి టౌన్:** ప్రజలకు అవగాహన కల్పించడంతోనే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మంజువాణి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీసీ కూడలిలో మానవహారంగా ఏర్పడి హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం, ఎయిడ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు, ఎయిడ్స్‌కు మందు లేదు, నివారణే మార్గం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్య శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన ఐసీటీసీ, ఏఆర్‌టీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అసురక్షిత లైంగిక సంబంధాలే ఎయిడ్స్‌కు దారి తీస్తున్నాయన్నారు. ఎయిడ్స్ బాధితులను చులకనగా చూడరాదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కళా బృందాలు ఏర్పాటు చేసి వీధి నాటక కళారూపకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి తిప్పయ్య మాట్లాడుతూ 'సమానత్వం' అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. యువత అవగాహనతో ముందుకు వెళితే హెచ్‌ఐవీ సోకకుండా జిల్లాను ఎయిడ్స్ రహితంగా తీర్చి దిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల జన జాగృతి ప్రాజెక్ట్ డైరెక్టర్ బలరాం, ప్రాజెక్టు మేనేజర్లు ఈశ్వరయ్య, ఆంజనేయలు, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, జిల్లా ఆరోగ్య వైద్య సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలతో నిలువుదోపిడీ

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం

**సోమందేపల్లి:** ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించి, ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. ఆదివారం నాగినాయనిచెరువు గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల అమలు అటకెక్కించి ఆరు నెలల వ్యవధిలో రెండు దఫాలు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర, ఇతర ధరలు పెరిగి సామాన్యులు ఆర్థికంగా కుదేలయ్యారని చెప్పారు. అధికారం కోసం మాత్రమే కూటమి నేతలు అలవికాని హామీలు ఇచ్చారన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని తెలిపారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, గోవిందమ్మ గారి శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచ్ అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఏకపక్షంగా కేసులు నమోదు చేయడం తగదు**
**పెనుకొండ రూరల్:** వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఏకపక్షంగా కేసులు నమోదు చేయడం తగదని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఖండించారు. ఆదివారం పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మావటూరు చెందిన శ్రీనివాసులు, ముకుందను ఆమె పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. చిన్నపాటి భూ వివాదానికి సంబంధించి న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్లిన వారిపైనే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అరెస్టు చూపకుండా అక్రమంగా నిర్బంధించడం సరికాదన్నారు. బాధితులు వద్దన్నా కేసు నమోదు చేయడం వెనుక ఆంతర్యమేమిటన్నారు. కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డికి సంబంధించి రెండేళ్ల క్రితం జరిగిన సివిల్ సంఘటనపై ఇప్పుడు కేసులు నమోదు చెయ్యడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. మావటూరులో ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారకులైన టీడీపీ నాయకులు గోపాల్, నరసింహలుపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఎస్‌ఐ ఏకపక్షంగా వ్యవహరించడం కరెక్టు కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, నాయకులు యాసిన్, బాబు, కిష్టా, గణప్ప, కొండలరాయుడు, రాము పాల్గొన్నారు.



పెనుకొండ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

## అలరించిన హనుమంతుని లీలా వైభవం

**ప్రశాంతి నిలయం :** పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హైదరాబాద్ సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం కర్ణాటక సంగీత విద్వాంసురాలు సౌమ్యా వారణాసి చక్కటి భక్తిగీతాలను ఆలపిస్తూ నిర్వహించిన కచేరీ భక్తులను మైమరపించింది. సాయంత్రం సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు ప్రదర్శించిన 'హనుమంతుని లీలా వైభవం' నృత్య రూపకం అలరించింది. రామాయణ పురాణ ఇతిహాసం ఆధారంగా హనువంతుని గుణగణాలను వివరించే పలు ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

**మొబైల్ ఐ క్లినిక్ వాహనం ప్రారంభం**
పర్వత ప్రాంతాలైన హిమాలయాలలోని లద్దాఖ్‌తోపాటు చండీఘర్, హర్యాణ తదితర ప్రాంతాల ప్రజలకు కంటి వైద్య సేవలు అందించే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నూతన మొబైల్ ఐ క్లినిక్ వాహనాన్ని ఆదివారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు సేవలు అందించే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందని తెలిపారు.



మొబైల్ ఐ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్‌రాజు



నృత్య రూపకంలోని ఒక ఘట్టం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సౌమ్య వారణాసి బృందం

## 13 మండలాల్లో వర్షం



ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచిన మొక్కజొన్నలు

**పుట్టపర్తి అర్బన్:** ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. ఆదివారం 13 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా తనకల్లు మండలంలో 7.2 మి.మీ, ఎన్‌పీ కుంట 6, అమడగూరు 6, నల్లచెరువు 5.4, కదిరి 4.2, తలుపుల 3.8, గాండ్లపెంట 3.6, పుట్టపర్తి 3.4, బుక్కపట్నం 2.8, కొత్తచెరువు 2.4, నల్లమాడ 2, ఓడీ చెరువు 1.2, చిలమత్తూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా కోతకు వచ్చిన పంటలను చివరి క్షణంలో కోయడంతో ప్రస్తుత వర్షాలకు చిక్కాయి. కల్లాలకు చేరిన వడ్లు, రోడ్లపైకి చేర్చిన మొక్కజొన్నలపై రైతులు కవర్లు కప్పి ఉంచారు. అయితే మూడు రోజులపాటు వర్షాలు కురిస్తే మొలకలు వస్తాయేమోనని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.



కవర్లు కప్పి జాగ్రత్త చేసిన వడ్లు

## క్లుప్తంగా

### విద్యార్థి హత్య ఘటనలో టీచర్లను బాధ్యులను చేయొద్దు

పుట్టపర్తి: అమిదాలగొంది పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చేతన్‌ను బంధువులు కిడ్నాప్ చేసి హతమార్చడం దారుణమని, అయితే ఈ ఘటనకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బందిని బాధ్యులను చేయడం తగదంటూ జిల్లా వైఎస్సార్‌టీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, ఇంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి బంధువులమని చెప్పి ఇంటర్వెల్‌లో బాలుడి ఇష్టపూర్వకంగానే వారు బయటకు పిలుచుకెళ్లారని గుర్తు చేశారు. ఈ ఘటనలో హెచ్‌ఎంను సస్పెండ్ చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని కోరారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

నల్లచెరువు: మండలంలోని పల్లెవాండ్లపల్లి సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.14,510 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### అలరించిన 'సంగీత సాగర సమ్మేళనం'



శాస్త్రీయ సంగీతంతో ఆకట్టుకున్న ప్రఖ్యాత గాయని నిరంజన్ శ్రీనివాసన్

అనంతపురం కల్చరల్: నగుమోము కనరే.. రఘునందన వంటి సంకీర్తనలను ప్రఖ్యాత గాయని పుట్టమ్మాల్ శిష్యురాలు నిరంజన్ శ్రీనివాస్ ఆలపిస్తుంటే శ్రోతలు మంత్రముగ్ధులయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక త్యాగరాజ సంగీత సభలో సప్త సరస్వతీ మణుల సుమధుర సంగీత సాగర సమ్మేళనం ఏర్పాటు చేశారు. సంగీత విభావరిలో పలువురు ప్రతిభావంతులైన మహిళలు వివిధ వాయిద్యాలతో ఆకట్టుకున్నారు. త్యాగరాజ సంగీత సభ కార్యదర్శి ప్రభావతి నేతృత్వంలో సాగిన సంగీతోత్సవంలో త్యాగయ్య, పురంధరదాసు, అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. డాక్టర్ అనంత లక్ష్మి వయిలిన్, రంజని మృదంగం, రమ ఘటం, బోర్సింగ్‌పై విజయలక్ష్మి తదితరులు వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా సంగీత సభ వ్యవస్థాపకులు జ్ఞానేశ్వర రావు ఉత్తార్కర్, సభ తొలి కార్యదర్శిగా పని చేసిన పద్మజ సురేష్ మాట్లాడుతూ.. కళాకారులు నగరంలోని త్యాగరాజ సంగీత సభను అద్వితీయమైన కళాసంపత్తితో సుసంపన్నం చేశారని తెలిపారు. అదే కోవలో భవిష్యత్తులోనూ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు, సంగీత కచేరీలు నిర్వహించాలని తీర్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, చార్టెడ్ అకౌంటెంట్ హరిశ్చంద్ర రామ, సాయిబాబా కాలేజ్ పీఎల్ఎన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాడి పెరిగి.. రైతు మురిసి

- ఐదేళ్లుగా పాడి పరిశ్రమ వృద్ధి
- పాలు, నెయ్యి, పేడ విక్రయంతో ఆదాయం



మేతకు వెళుతున్న దేశవాళీ ఆవులు, ఎద్దులు

పుట్టపర్తి అర్బన్: పాడి ఆవుల సంఖ్య పెరగడంతో గ్రామీణ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా ఉన్న జిల్లాలో గత 5 ఏళ్లలో పశువులు, జీవాలు, పాడి ఆవుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో పాడి పశువులకు సమృద్ధిగా మేత, నీళ్లు లభ్యమవుతోంది. జిల్లాలో విస్తరించిన 1.25 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం శివారు గ్రామాల్లో అత్యధికంగా దేశవాళీ ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకల పెంపకాన్ని రైతులు చేపట్టారు. ఆరోగ్యకరమైన పాలు, భూములకు సేంద్రియ ఎరువుగా పేడ విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవితం ప్రశాంతంగా సాగిపోతోందని పాడి రైతులు అంటున్నారు.

**పాలు, పేడ ఎరువుతో లాభాలు**

దేశవాళీ ఆవులు పాలు తక్కువగానే ఇస్తున్నా.. వాటి పెరుగు, స్వచ్ఛమైన నెయ్యితో పాడి రైతులు లాభాలు గడిస్తున్నారు. దేశవాళీ ఆవుల నెయ్యి కిలో రూ.3,500 నుంచి రూ.4 వేల వరకూ అమ్ముతున్నారు. భూములకు సేంద్రియ ఎరువుగా పేడను విక్రయిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, చిక్కబళ్లాపూర్, బాగేపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు ఒక్కో లారీ పేడ ఎరువును రూ.10 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఆవు పాలలో ప్రొటీన్లు, జింక్, అయోడిన్, ఐరన్ అధికంగా ఉంటాయి. 100 గ్రాముల ఆవు పాలలో 60 క్యాలరీల శక్తి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

**జిల్లాలో పశు సంపద**

జిల్లాలో పశు సంపద 3.21 లక్షలు ఉండగా 1.10 లక్షల వరకూ గేదెలు ఉన్నాయి. ఇక 5 లక్షల మేకలు, 29.50 లక్షల గొర్రెలు ఉన్నాయి. ఏటా పశు సంపద పెరుగుతూనే ఉంది. గత ప్రభుత్వం పాడి రైతులు సంక్షేమానికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. జిల్లాలో 66 పశువుల ఆసుపత్రులు, 23 గ్రామీణ పశు వైద్యశాలలు, 33 మంది డాక్టర్లను అందుబాటులో ఉంచారు. ఎలాంటి వ్యాధులు వచ్చినా టీకాలు ఉంచడానికి వాక్ ఇన్ కూలర్లనూ అందుబాటులోకి తెచ్చారు. పశువులు చనిపోతే పరిహారం సైతం అందజేయడంతో అత్యధికంగా రైతులు పాడి పోషణపై దృష్టి సారించారు.

### దేశవాళీ ఆవుల సంరక్షణ సులువు



అటవీ ప్రాంతం చెంతనే ఉండడంతో పశువుల సంరక్షణ సులభం. ఉదయం అటవీ ప్రాంతానికి తోలితే వాటికి ఇష్టమైనప్పుడు వచ్చి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉంటాయి. వాటి పేడకు మంచి గిరాకీ ఉంది. కర్ణాటక నుంచి వచ్చి లారీల్లో తరలిస్తుంటారు. పాలకు గిట్టుబాటు ధర లభిస్తోంది.

– బాలగంగాధర్‌రెడ్డి, సాతార్లపల్లి

### పశు సంపద పెరిగింది



మేతకు, నీళ్లకు ఇబ్బంది లేక పోవడంతో జిల్లాలో పశుసంపద గతంతో పోల్చుకుంటే చాలా పెరిగింది. అటవీ గ్రామాల్లో దేశవాళీ ఆవుల సంఖ్య ఎక్కువగా ఉంది. వీటి పాలకు, నెయ్యికి, పేడకు అధిక డిమాండ్ నెలకొంది.

– శుభదాస్, పశు సంవర్ధకశాఖ అధికారి

### నెయ్యి కోసం కర్ణాటక నుంచి వస్తున్నారు



దేశవాళీ ఆవుల నెయ్యికి మంచి గిరాకీ ఉంది. ఎక్కడెక్కడ నుండి వచ్చి నెయ్యి కొనుగోలు చేస్తున్నారు. కర్ణాటక నుంచి చాలా మంది వస్తుంటారు. కిలో నెయ్యి రూ.4 వేల వరకూ విక్రయిస్తున్నాం. ఇది మంచి ఆదాయ మార్గం.

– కామాక్షమ్మ, గంగిరెడ్డిపల్లి

# విహారయాత్రలో విషాదం

- విడపనకల్లు వద్ద కారు ప్రమాదం
- ఇద్దరు వైద్యులు, వ్యాపారి మృతి
- మరో వైద్యునికి తీవ్రగాయాలు
- హాంకాంగ్ నుంచి తిరిగి వస్తూ మృత్యుఒడికి



ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యాలు

సాక్షి, బళ్లారి/బళ్లారి రూరల్/విడపనకల్లు: పని ఒత్తిడి నుంచి విరామానికి వారంతా ఏడాదికోసారి విదేశాలకు విహారయాత్రగా వెళ్లేవారు. ఈ ఏడాది కూడా అలా వెళ్లిన వారు ఎంతో సంతోషంగా తిరిగి ఇళ్లకు వెళ్తుండగా మృత్యువు పంజా విసిరింది. రోడ్డు ప్రమాదం రూపంలో ప్రాణాలు కబళించేసింది. ఆదివారం బళ్లారి తాలూకా చెళ్లగుర్కి సమీపంలోని విడపనకల్లు వద్ద కారు చెట్టుకు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందిన ఘటన జిల్లాలో విషాదం నింపింది. ప్రముఖ క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు గోవిందరాజులు (54), డాక్టర్ యోగీష్ (53), వారి మిత్రుడు, వ్యాపారి వెంకటనాయుడు (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో ప్రముఖ వైద్యుడు అమరగౌడ పాటిల్ (55) తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా బళ్లారి నగరానికి చెందినవారు. మరణించిన ఇద్దరు వైద్యులు బళ్లారి వైద్య కళాశాల (బిమ్స్, గతంలో విమ్స్) ఆస్పత్రిలో ప్రముఖ వైద్యులు కావడంతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది.

**అరగంటలో ఇంటికి చేరేలోపే..**

వీరంతా నాలుగు రోజుల హాంకాంగ్ యాత్ర ముగించుకుని బెంగళూరు దేవనహళ్లి విమానాశ్రయంలో దిగి కారులో బళ్లారికి బయలుదేరారు. మరో అరగంటలో బళ్లారికి చేరుతామనుకునేలోపే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రునితో కలిపి బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కారు అమరేగౌడకు చెందిన మహీంద్రా ఎక్స్‌యూవీ కాగా, దానిని డా.గోవిందరాజులు డ్రైవింగ్ చేస్తున్నారు.

**కుటుంబాల నేపథ్యం**

డాక్టర్ గోవిందరాజులుకు ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు. ఈయన భార్య రచన డెంటల్ డాక్టర్, ఇద్దరు వైద్య విద్యనభ్యసిస్తున్న కుమార్తెలు ఉన్నారు. మరో డాక్టర్ యోగీష్ ఆప్తమాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ కాగా ఈయన కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. భార్య విజయలక్ష్మీ డెంటల్ డాక్టర్, ఇద్దరు కుమారులు ఉండగా, ఒకరు ఎంబీబీఎస్ చదువుతున్నారు. మరో వైద్యుడు డాక్టర్ అమరేగౌడ పాటిల్ ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపారు.

**శోకసంద్రంగా బిమ్స్**

విహారయాత్రకు వెళ్లిన వారు కానరాని లోకాలకు వెళ్లడంతో మృతుల కుటుంబాలు కన్నీమున్నీరుగా విలపించారు. బిమ్స్ మార్చురీ వద్ద కుటుంబ సభ్యులతో పాటు, మృతులు బంధువులు, స్నేహితులు, స్థానిక వైద్యులు విషాదంలో మునిగిపోయారు. బీజేపీ నేత ఆర్ అశోక్, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే నారా సూర్య నారాయణరెడ్డి, మాజీ ఎంపీ సన్నపక్కీరప్ప తదితరులు మృతుల కుటుంబాలను పరామర్శించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

### 'సూపర్ సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.ఎస్.వలి అన్నారు. ఇక పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కన పెట్టి మతాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజా హక్కుల సభ పోస్టర్లను నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వలి మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయని వారిని తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈనెల 4వ తేదీన విజయవాడలో ప్రజా హక్కుల సభ చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్పొరేట్ సామ్రాజ్యానికి అధిపతిగా వ్యవహరిస్తూ రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా కార్పొరేట్ చేతుల్లో పెట్టబోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సమస్యలను పవన్ కళ్యాణ్ పట్టించుకోకుండా మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వీటన్నింటికీ సమాధానంగా నిర్వహిస్తున్న ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలన్నారు. సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచర్యా, కేంద్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వేమన, జిల్లా నాయకులు సుజాత, బాలకృష్ణ, బాషా, పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల చెంతకు బాలిక

పరిగి: తల్లిదండ్రుల మందలింపుతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు... పరిగిలోని సీతారాంపురం కాలనీలో నివాసముంటున్న ఓ బాలిక స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఏడో తరగతి చదువుకుంటోంది. ఈ క్రమంలో పరీక్షలు దగ్గర పడుతున్నాయని, చదువులపై శ్రద్ధ పెట్టాలంటూ శనివారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అర్ధరాత్రి సమయంలో పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఎస్‌ఐ రంగడు యాదవ్ వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలో దింపి పరిగితో పాటూ హిందూపురంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో గాలింపు చేపట్టారు. ఆదివారం వేకువజాము 4.30 గంటలకు సీతారాంపురం కాలనీలోని పాత భవనం వెనక ఉన్న ఇంటి వద్ద నిద్రిస్తున్న బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సున్నితమైన మనస్తత్వం కలిగిన పిల్లల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు.

### వృద్ధుడి దుర్మరణం

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వలస కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రకు చెందిన మోహన్‌పవార్ దగడ, దిలీప్ పవార్ కొంత కాలం క్రితం వలస వచ్చి రంగసముద్రం గ్రామం వద్ద బొగ్గులు కాల్చే పనిలో కూలీలుగా చేరారు. ఆదివారం వేపులపర్తి క్రాస్ వద్ద చికెన్ కొనుగోలు చేసుకుని ఇద్దరూ ద్విచక్రవాహనంపై రంగసముద్రానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పూలకుంట గ్రామానికి చెందిన శివలింగ, ఆయన కుమారుడు హేమంత్ పొలంలో కూలీలకు భోజనం ఇచ్చి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఎదురుగా వచ్చిన దిలీప్ పవార్ వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో కిందపడిన మోహన్‌పవార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ముగ్గురునీ స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. మృతుడికి భార్య మంగళాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### విద్యారంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యం

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్

రాయదుర్గం టౌన్: విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల్ని చైతన్యపరిచి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే ప్రస్తుతం ఐక్య ఉపాధాయ ఫెడరేషన్ ప్రధాన లక్ష్యమని, ఇందు కోసం రాజీలేని పోరాటాలు చేపట్టనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఆడిటోరియంలో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం వందలాది మంది ఉపాధ్యాయులు, అగ్ర నాయకులు స్థానిక జూనియర్ కళాశాల నుంచి కణేకల్లు రోడ్డు, లక్ష్మీబజార్, అనంతపురం రహదారి, పాతబస్టాండ్, వినాయక సర్కిల్ మీదుగా తిరిగి కళాశాల వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సురేష్‌కుమార్ మాట్లాడుతూ... సామాజిక మార్పుతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటీకరణ నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు సంక్షేమంగా ఉంటే విద్యార్థుల భవిష్యతుకు గట్టి పునాది ఏర్పడుతుందన్నారు. విద్యారంగం ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పుడే అన్ని వర్గాలు అభివృద్ధి, సంక్షేమం వైపు పయనిస్తాయన్నారు. ప్రస్తుతం బోధనేతర పనులు, ఒత్తిడి పెరుగుతుండడంతో బోధనపై ఉపాధ్యాయులు దృష్టిసారించలేని పరిస్థితులు ఉన్నట్లు ఆవేదన చెందారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, స్థానిక మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

### అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

తాడిపత్రి టౌన్: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు... తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన సలాం (48) 4 నెలల క్రితం భార్యకు విడాకులిచ్చి ఒంటరిగా నివాసముంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన ఆదివారం అతిగా మద్యం సేవించి అశోక్ పిల్లర్ సమీపంలో పడిపోయాడు. స్థానికులు గమనించేలోపు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- నెల రోజుల క్రితం షాక్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



చిత్రా శివ (ఫైల్)

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన చిత్రా శివ(26) ప్రైవేట్ విద్యుత్ హెల్పర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత నెల 2న ఓ రైతు పొలంలో మరమ్మతుల కోసం వెళ్లిన ఆయన షాక్‌కు గురై, తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం ఆయన మృతిచెందాడు. కాగా, శివకు భార్య ఆశ, ఏడు నెలల వయసున్న కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

**మృతదేహంతో ఆందోళన**

పోస్టుమార్టం అనంతరం శివ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు రైతు నాగరాజు ఇంటి ముందు ఉంచి ఆందోళనకు దిగారు. విద్యుత్ శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా శివాను నమ్మించి పిలుచుకెళ్లాడని, మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం చోటు చేసుకుని శివ మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు ఆరోపించారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వ్యక్తిగత పనిపై మరో గ్రామానికి వెళ్లిన నాగరాజు రాగానే మాట్లాడి న్యాయం చేస్తామంటూ సర్దిచెప్పినా బాధితులు వినలేదు. తమకు న్యాయం జరిగే వరకూ అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లబోమంటూ భీష్మించారు.

### ఆకట్టుకున్న భగవద్గీత అవధానం



భగవద్గీత విశేషాలను వివరిస్తున్న అవధానులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత సకల సమస్యలకు పరిష్కార మార్గమని భగవద్గీత అవధాని బుర్ల తిక్కలక్ష్మన్న అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వేణుగోపాల నగర్‌లోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో భగవద్గీత అవధాన కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా హాలేబీడు గ్రామానికి చెందిన అంధ ఉపాధ్యాయుడు, భగవద్గీత అవధాని గీతా విశేషాలను ఆసక్తికరంగా వినిపించారు. తెలుగు భాషా పండితులు వరప్రసాద్, సీనియర్ పండితుడు శివశంకరయ్య తదితరులు మాట్లాడుతూ.. తిక్క లక్ష్మన్న అద్భుతమైన జ్ఞానంతో గీతాప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆయన ఇప్పటి వరకు 78 గీతా యజ్ఞాలు పూర్తి చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా బ్రెయిలీ లిపి ద్వారా భగవద్గీతను అనువాదం చేశారని గుర్తు చేశారు. అనంతరం అవధానిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గిరిధర్‌రెడ్డి



జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

పుట్టపర్తి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ వెంటనే ప్రటించాలని ప్రభుత్వాన్ని ప్రొగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గిరిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం వేదికగా పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎం.గిరిధర్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా చూడాలన్నారు. వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు.

**రెండు జిల్లాలకు నూతన కార్యవర్గం**

ఈ సందర్భంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కమిటీలకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా టి.పురుషోత్తంరెడ్డి, ప్రధానకార్యదర్శిగా తిమ్మారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సీనియర్ నాయకులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ.శ్రీరాములు వ్యవహరించారు.

### పంపనూరు.. భక్తజన హోరు

ఆత్మకూరు: కార్తీక మాసంలో ఆఖరి ఆదివారం కావడంతో ఆత్మకూరు మండలం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దర్శనానికి గంటల సమయం పట్టింది. కాల సర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగనంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బంగారు కవచ అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం